క్లుప్తంగా

చాముండేశ్వరీదేవికి పూలంగిసేవ



ఇందుకూరుపేట: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పూలంగి సేవ జరిపారు. రాముడుపాళెం గ్రామానికి చెందిన తోటపల్లి చంద్రశేఖర్‌నాయుడు, వెంకటశేషమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



గజలక్ష్మిగా అమ్మవారు

మనుబోలు: శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక విష్ణాలయంలో లక్ష్మీదేవికి శుక్రవారం పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గురించర్ల హరేందర్‌రెడ్డి, పద్మజ్యోతి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

స్మార్ట్ మీటర్లతో నష్టం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: స్మార్ట్ మీటర్లు బిగించుకుంటే ప్రజలకు తీరని నష్టం కలుగుతుందని సీపీఎం నాయకులు అన్నారు. పట్టణంలోని కామాక్షి కాలనీలో స్మార్ట్ మీటర్లపై సీపీఎం నాయకులు శుక్రవారం ఆవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ప్రైవేటు కంపెనీలు అమర్చడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామాలుగా మారాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లాలో ప్రతి గ్రామం చెత్త రహిత గ్రామాలుగా మారాలని డీపీఓ రమణయ్య అన్నారు. మండలంలోని మినగల్లు గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త నిల్వ ఉండకుండా పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెత్తరహిత గ్రామాలు ఆరోగ్యకరంగా ఉంటాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ సేవలు అమూల్యం

నెల్లూరు(క్రైమ్): 'క్రమశిక్షణ, అంకితభావంతో మీరు సుదీర్ఘకాలం అందించిన సేవలు అమూల్యం. ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో శేష జీవితం సంతోషంగా గడపాలి' అని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ శాఖలో ఏఏఓగా పనిచేస్తున్న షేక్ ఖతీజా బేగం, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం, ఏఎస్సైలు జీఆర్పీ రామరాజు, డి.హరేంద్రబాబు, పి.జనార్దన్ శ్రీనివాస్, ఏఆర్ ఎస్సైలు వి.శ్రీహరి, షేక్ షౌకత్‌బాషా, సి.చంద్రశేఖర్‌రెడ్డిలు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. శుక్రవారం స్థానిక ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఏఎస్పీ వారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సమావేశంలో నగర, రూరల్, ఎస్‌బీ, ఏఆర్ డీఎస్పీలు పి.సింధుప్రియ, జి.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, ఎస్.చంద్రమోహన్, ఏఓ చంద్రమౌళి, డీటీసీ ఇన్‌స్పెక్టర్ మిద్దె నాగేశ్వరమ్మ, ఏపీ పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ హాస్టళ్లకు కొత్త వంటపాత్రలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రభుత్వ వసతి గృహాలకు కొత్తవంట పాత్రలను ప్రభుత్వం అందజేసిందని బీసీ సంక్షేమ శాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ నుంచి జిల్లా కార్యాలయానికి వచ్చాయన్నారు. 73 హాస్టళ్లకు సరఫరా చేస్తామని చెప్పారు. పాత్రల విలువ రూ.7.5 లక్షలు ఉంటుందన్నారు. ఫ్రెషర్స్ డే నిర్వహించాలని బీసీ సంక్షేమ శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. హాస్టళ్లలో ఈ ఏడాది చేరిన విద్యార్థులకు ఈనెల 6, 7, 8 తేదీల్లో ఫ్రెషర్స్ డే నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు వార్డెన్లకు ఆదేశాలిచ్చామన్నారు.

ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా

పొదలకూరు : ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందని, బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పడితే మొదటి టీకాలా పనిచేస్తాయని, వ్యాధులు దరిచేరవని వెంకటాచలం సీడీపీఓ విజయలక్ష్మి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మహ్మదాపురం ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన సదస్సు, ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డకు ఆరుమాసాల వరకు తల్లిపాలు పట్టాలని సూచించారు. డబ్బాపాలు పట్టిస్తే బిడ్డకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు బరువు పెరిగే పరిస్థితి ఉండదన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ, స్కూల్‌టీచర్ రామకృష్ణ, అంగన్‌వాడీలు ప్రమీల, భారతి, రాజేశ్వరి, ఆశావర్కర్లు సుజాత, రత్నమ్మ పాల్గొన్నారు.



పొదలకూరు: అవగాహన ర్యాలీలో సీడీపీఓ విజయలక్ష్మి

అమృతంతో సమానం

ఇందుకూరుపేట: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ అన్నారు. జగదేవిపేట అంగనవాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టడం వల్ల వ్యాధులు దరిచేరవని తెలిపారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు తల్లిపాలు పట్టాలని సూచించారు. పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ బాలింతలకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. అంగనవాడీలు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక శక్తి పెంపు

కొడవలూరు: బిడ్డకు తల్లి ముర్రుపాలను పట్టడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీ నాగభూషణమ్మ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నార్తురాజుపాళెందిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలను పట్టడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఎదగడంతో పాటు తల్లి కూడా కేన్సర్ వ్యాధి నుంచి తప్పించుకోవచ్చన్నారు. అనంతరం పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎన్ సుదర్శన, ఆయా టీ ప్రసన్న పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

తోటపల్లిగూడూరు: బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ పేడూరుసెక్టార్ సూపర్‌వైజర్ లలితాంబ పేర్కొన్నారు. చిన్నచెరుకూరు దళితకాని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఏడాది పాటు విధిగా తల్లిపాలు పట్టిస్తే బిడ్డలు ఆరోగ్యంగా, పుష్టికరంగా ఎదుగుతారన్నారు. అంగన్‌వాడీలు అనురాధ, భవానీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: అవగాహన కల్పిస్తున్న సుబ్బరత్నమ్మ



టీపీగూడూరు: చిన్నచెరుకూరు ఎస్సీకాలనీలో..



కొడవలూరు: తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

ఇంటింటి చెత్త సేకరణ పరిశీలన

మనుబోలు: మండలంలోని బండేపల్లిలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని డిప్యూటీ ఎంపీడీఓ నారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. అనంతరం సంపద తయారీ కేంద్రానికి తరలించి తడిచెత్తను వర్మికంపోస్టుగా మార్చాలన్నారు. వర్మికంపోస్టును రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గిరికిరణ్ ఉన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ

కోవూరులో కిడ్నాప్ కలకలం

కోవూరు : మండల కేంద్రమైన కోవూరులో శుక్రవారం రాత్రి కిడ్నాప్ కలకలం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో లోకేశ్ అనే యువకుడు గిఫ్ట్ ఆర్టికల్స్ షాపు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు లోకేశ్ షాపు వద్దకు వచ్చారు. ముందుగా షాప్‌లోని సీసీ కెమెరా కేబుళ్లను కత్తిరించారు. ఆ తరువాత యువకుడ్ని బలవంతంగా కారులో ఎక్కించుకుని వేగంగా పారిపోయారు. సమీప వ్యాపారులు, గమనించి పోలీసులకు సమాచారం అందజేయగా వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. షాపు పరిసరాల్లోని సీసీ కెమెరా దృశ్యాలు, సాంకేతిక ఆధారాల ద్వారా కిడ్నాప్ చేసిన వ్యక్తులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కిడ్నాప్ వెనుక వ్యాపార సంబంధాలు, వ్యక్తిగత వైరం లేదా ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా యువకుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

చెరువు మట్టి అక్రమ తరలింపు

ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరు మండలం పిడతాపోలూరు చెరువులోని మట్టిని కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. యంత్రాలను ఏర్పాటు చేసుకుని ఇష్టారాజ్యంగా రేయింబవళ్లు తవ్వకాలు జరుపుతూ టిప్పర్ల ద్వారా లేఅవుట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారం సోషల్‌మీడియాలో సైతం హల్‌చల్ చేస్తోంది. నిత్యం మట్టి దందా సాగిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులే మట్టి తరలింపును అడ్డుకుని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



న్యాయశాఖ ఉద్యోగులకు వీడ్కోలు సన్మానం

నెల్లూరు(లీగల్): న్యాయశాఖలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన పురిణి చంద్రశేఖర్, ఆళ్ల అరుణను శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో సన్మానించారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమన్నారు. శ్రీనివాస్, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యప్పరెడ్డి ఉద్యోగులను శాలువాతో సన్మానించారు. బాల గాయకుడు అజిత్‌రామ్ పాటలు పాడి ఆకట్టుకున్నాడు. కార్యక్రమంలో వివిధ కోర్టుల న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజయాదవ్, ఉపాధ్యక్షుడు జల్లి పద్మాకర్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పీవీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటసునీల్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్ దంపతులను సన్మానిస్తున్న న్యాయమూర్తి

వితంతు పింఛన్ల పంపిణీ

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గానికి కొత్తగా 720 వితంతు పింఛన్లను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వితంతు పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండలేరు ఎడమకాలువకు శనివారం నుంచి సాగునీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు, నాయకులు మస్తాన్ బాబు, వెంకరత్నం, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున్‌నాయుడు పాల్గొన్నారు.



పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

11న ఈఎంఆర్‌ఎస్‌లో గెస్ట్‌టీచర్ల ఎంపికలు

కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల(ఈఎంఆర్‌ఎస్)లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి గెస్ట్ టీచర్ల ఎంపికలను ఈ నెల 11న ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రీతమ్‌బిశ్వాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయనశాస్త్ర ఉపాధ్యాయులు–1, వ్యాయామ ఉపాధ్యాయులు స్త్రీ–1, పురుషులు–1, హాస్టల్ వార్డెన్ (మహిళ)–1 చొప్పున ఖాళీలు ఉన్నాయని చెప్పారు. బోధకులు పీజీ అర్హత కలిగి ఉండాలన్నారు. మిగిలిన పోస్టులకు 25 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు కలిగి సంబంధిత విద్యార్హత ఉన్న వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

సులభంగా అర్థమయ్యేలా బోధన చేయాలి

కోవూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా నూతన సాంకేతికతల వినియోగంతో బోధన కొనసాగించాలని డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వరనాయక్ అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. హెచ్‌ఎం సోఫియాకిరణ్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్నానదిలో యువకుడి గల్లంతు

కోవూరు: సరదాగా స్నేహితులతో కలిసి పెన్నా నదిలోకి ఈతకు వెళ్లిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటనమండలంలోని పాతిరెడ్డిపాళెం సమీపంలోని పల్లెపాళెం వద్ద శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..పల్లెపాళేనికి చెందిన మేకల సురేష్ తన స్నేహితులు ఐదుగురితో కలిసి సరదాగా ఈతకొట్టేందుకు పెన్నా నదిలోకి వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో సురేష్ నీటిలో మునిగిపోయాడు. తోటి స్నేహితులు గమనించి వెంటనే గ్రామస్తులు సహకారంతో పెన్నానదిలో గాలింపు చర్యలు ప్రారంభించారు. సాయంత్రం వరకు గాలించినప్పటికీ సురేష్ ఆచూకీ లభించలేదు. చీకట్లు కమ్ముకోవడంతో గాలింపు నిలిపివేశారు. శనివారం ఉదయం అధికార యంత్రాంగం సహకారంతో మళ్లీ గాలింపు చర్యలు కొనసాగించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా సురేష్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు, స్నేహితులు ఆందోళన చెందుతున్నారు.



గల్లంతైన సురేష్

జగన్ పర్యటన విజయవంతంపై ధన్యవాదాలు

కోవూరు: నెల్లూరులో గురువారం జరిగిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను పోలీసుల ఆంక్షలను ఛేదించుకుని వచ్చి విజయవంతం చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులకు పేరుపేరున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఆ పార్టీ మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకష్ణారెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ విజయకుమార్ అన్నారు. కోవూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు తరలిరాకుండా పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజానాయకుడ్ని చూసేందుకు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం అరాచక పాలనను ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారన్నారు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడుస్తున్నారన్నారు. 2029 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డిపై పోలీసులు లాఠీచార్జీ సైతం చేశారని, పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా గాయపడ్డారన్నారు. పోలీసుల లాఠీచార్జీలో గాయపడిన వారిని మరో రెండ్రోజుల్లో ప్రసన్నకుమార్‌రెడ్డి స్వయంగా వచ్చి పరామర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, జిల్లా యాక్టివ్ కార్యదర్శి నలుబోలు సుబ్బారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, మాజీ సర్పంచ్ ఉమ, పార్టీ మండలాధ్యక్షులు నవీన్‌కుమార్‌రెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి ఉదయభాస్కర్, విజయసేనారెడ్డి, రఫీ, శ్రీధర్, చిరంజీవి, శ్రీను పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉపాధ్యాయినిగా గాయత్రి సేవలు ఎనలేనివి

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయిని సీహెచ్ గాయత్రి ఉద్యోగ విరమణ సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఏ మోహన రామలింగయ్య మాట్లాడుతూ నలభై యేళ్లపాటు ఉపాధ్యాయినిగా గాయత్రి అందించిన సేవలు ఎనలేనివన్నారు. ప్రతిచోటా క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారన్నారు. ఆమె సుదీర్ఘ ప్రస్థానంలో ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి వారి మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. అనంతరం గాయత్రి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



గాయత్రి దంపతులకు సత్కారం

లక్ష్మీదేవికి పంచామృతాభిషేకం



పొదలకూరు: లక్ష్మీదేవికి పంచామృతాభిషేకం



పొదలకూరు: అభిషేక సేవలో పాల్గొన్న భక్తులు

పొదలకూరు : శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం దేవదేవేరులకు విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా దేవస్థానం సభ్యుడు లక్ష్మీనారాయణ, లక్ష్మి దంపతులు వ్యవహరించారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన

కొడవలూరు: కీటక జనిత వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ సబ్ యూనిట్ అధికారి నాగరాజు సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేగేడి చెలిక, రాచర్లపాడులో కీటక జనిత వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల కారణంగా డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రమాదకర వ్యాధుల బారినపడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు రాత్రి వేళల్లో దోమకాటుకు గురికాకుండా విధిగా దోమతెరలు వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణ, హెచ్ఏ సుధాకర్, ఏఎన్‌ఎంలు పెంచలమ్మ, షీలా, ఆశాకార్యకర్త కామాక్షి పాల్గొన్నారు.



రాచర్లపాడులో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రభుత్వ భూమిని కాపాడాలి

తోటపల్లిగూడూరు: కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలని నరుకూరు పంచాయతీ అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు నరుకూరు వీఆర్వో జనార్దన్, పంచాయతీ కార్యదర్శి ప్రవల్లికకు శుక్రవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరుకూరు పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్–1 ఏ1, 1ఏ2లో 59 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందన్నారు. నరుకూరు సెంటర్ సమీపంలో నరుకూరు–కోడూరు రహదారిలో ఉన్న ఈ భూమి విలువ ప్రస్తుతం రూ.5 కోట్ల వరకు ఉంటుందన్నారు. గతంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్ వేస్తూ పక్కనే ఉన్న ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లు వేశారన్నారు. అప్పట్లో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని సంబంధిత స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే బరితెగించిన రియల్టర్లు అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను ఇటీవల తొలగించారన్నారు. అంతటితో ఆగకుండా ఆ భూమిని తమకు ఎలాగైనా తమకు స్వాధీనపరిచేలా చూడాలని అధికార పార్టీ నేతలను ఆశ్రయించడం జరిగిందన్నారు. నరుకూరు పంచాయతీనే కాకుండా తోటపల్లిగూడురు మండలానికి కూడా చెందని వారికి భూమిని కట్టబెట్టుందుకు కొందరు నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇది సమంజసం కాదని, ఎట్టి పరిస్థితుల్లో భూమిని బయట వ్యక్తులకు అప్పగించొద్దని నరుకూరు పంచాయతీ అఖిలపక్షం నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు వీఆర్వో జనార్దన్, పంచాయతీ కార్యదర్శి ప్రవల్లికకు శుక్రవారం వినతిపత్రాలను అందజేశారు.



వీఆర్వోకు వినతిపత్రాన్ని ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

నేడు జనసురక్షపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఎస్ఎస్ కల్యాణ మండపంలో జనసురక్షపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఆర్డీఏ అధికారి అంకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొదుపు మహిళలు ఖచ్చితంగా కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ఎంఈఓగా ఓబులు

మనుబోలు: మండల విద్యాశాఖ అధికారిగా జే ఓబులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇందుకూరుపేట మండలం మైపాడు జెడ్పీ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ మనుబోలు మండల ఎంఈఓగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

